సాక్షి విశాఖపట్నం

సోమవారం । 20 । నవంబర్ । 2023



ప్రణాళికతో సిద్ధమైతే.. 8లో

'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో గ్రూప్–1, 2 ఉద్యోగ పరీక్షలపై నిర్వహించిన అవగాహన సదస్సుకు విశేష స్పందన లభించింది.



ఆర్టీసీ 'కార్తీక' స్పెషల్స్

పంచారామక్షేత్రాలు, లంబసింగి, అరకు, ధారమఠానికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపుతోంది. 8లో



సాంకేతికతను అందిపుచ్చుకోండి

వైద్య రంగంలో వచ్చే అధునాతన వైద్య ప్రక్రియలు, విజ్ఞానాన్ని ఆకళింపు చేసుకోవాలని విశ్రాంత డీఎంఈ సూచించారు. 8లో

న్యూస్‌రీల్

అప్పన్నను దర్శించుకున్న ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న జస్టిస్ దినేష్‌కుమార్ శర్మ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దినేష్‌కుమార్‌శర్మ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అంతరాలయంలో స్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదాన్ని, శేషవస్త్రాలను, జ్ఞాపికను అధికారులు అందజేశారు.

3డీ ప్రింటింగ్ ఫెసిలిటీ ప్రారంభం



నూతన 3డీ ప్రింటింగ్ ఫెసిలిటీని ప్రారంభిస్తున్న రియర్ అడ్మిరల్ ఎఫ్ఎం జగదీష్

సింధియా: నేవల్ డాక్‌యార్డ్‌లో లేజర్ బెడ్ ఫ్యూజన్ టెక్నాలజీతో కూడిన అత్యాధునిక 3డీ ప్రింటింగ్ ఫెసిలిటీని రియర్ అడ్మిరల్ ఎఫ్ఎం జగదీష్ ఆదివారం ప్రారంభించారు. ఈ నూతన 3డీ ప్రింటింగ్ ఫెసిలిటీ 22 విభిన్న మెటాలిక్ భాగాలను ప్రింట్ చేయగలదని నేవీ అధికారులు తెలిపారు. ఎస్ఎం, ఏఎస్‌డీ ఆర్.విజయ్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఉత్తమ కేంద్రంగా 'విశాఖ ఇగ్నో'



అవార్డు అందుకుంటున్న ఇగ్నో విశాఖ డైరెక్టర్ ధర్మారావు

ఎంవీపీ కాలనీ: ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో) విశాఖపట్నం కేంద్రం జాతీయ స్థాయిలో ఉత్తమ కేంద్రంగా ఎంపికైంది. ఈ మేరకు ఇగ్నో విశాఖ ప్రాంతీయ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. ఢిల్లీలో జరిగిన 38వ ఇగ్నో వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖ ఇగ్నో కేంద్రం డైరెక్టర్ డాక్టర్ గోనిపాటి ధర్మారావు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్‌కుమార్ సక్సేనా చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. 2023 ఏడాదికి గాను ఈ అవార్డు లభించింది. ఈ సందర్భంగా పలువురు విద్యావేత్తలు, నగర ప్రముఖులు ఇగ్నో విశాఖ అధికారులకు అభినందనలు తెలిపారు.

క్రీడలపై ఆసక్తి అవసరం

విశాఖ స్పోర్ట్స్: క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాల్సిన అవసరం ఉందని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. వీఎంఆర్‌డీఏ పార్కులో స్కేటింగ్ పోటీల విజేతలకు ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉండాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పాఠశాలలో క్రీడల కోసం ప్రత్యేక కోచ్‌తో పాటు క్రీడా పరికరాలను సమకూర్చారన్నారు. ఈ కార్యక్రమంలో స్కేటర్లు, కోచ్‌లు పాల్గొన్నారు.

ఐఎన్ఎస్ డేగాలో విద్యార్థులు



చేతక్ హెలికాప్టర్ గురించి వివరిస్తున్న నేవీ అధికారులు

గోపాలపట్నం: నేవీ డే పురస్కరించుకుని నగరంలో ఏడు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఆదివారం ఐఎన్ఎస్ డేగా, నేవల్ ఎయిర్‌స్టేషన్‌ను సందర్శించారు. ఇక్కడ చేతక్ ఎయిర్‌క్రాఫ్ట్ పని చేసే విధానం, ఏరియల్ సెర్చ్, రెస్క్యూ ఆపరేషన్ ఏ విధంగా చేస్తారో నేవీ అధికారులు విద్యార్థులకు వివరించారు.

తీరంలో క్రికెట్ సందడి





విశాఖ స్పోర్ట్స్: ఆర్.కె.బీచ్.. ఆదివారం క్రికెట్ అభిమానులతో నిండిపోయింది. క్రికెట్ ప్రపంచకప్ టైటిల్ పోరును పెద్ద స్క్రీన్‌పై చూసేందుకు క్రీడాభిమానులంతా మధ్యాహ్నమే సాగరతీరానికి చేరుకున్నారు. బీచ్‌రోడ్డులోని కాళీమాత ఆలయం ఎదురుగా ఏసీఏ బిగ్ స్క్రీన్‌పై ఫైనల్ మ్యాచ్‌ను ప్రత్యక్ష ప్రసారం చేసింది. రెట్టించిన ఉత్సాహంతో అభిమానులు హాజరై.. మ్యాచ్‌ను వీక్షించారు. ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి గోపినాథ్‌రెడ్డితో సహా పలువురు సభ్యులు పెద్దతెరపై మ్యాచ్‌ను తిలకించారు. వైఎస్సార్ విగ్రహం నుంచి ఆర్.కె. బీచ్ వరకు ట్రాఫిక్‌ను పోలీసులు నియంత్రించారు. కైలాసపురం డీఎల్‌బీ మైదానంలో వైఎస్సార్ సీపీ ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.రాజు ఆధ్వర్యంలో భారీ స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు. అభిమానులు పెద్ద ఎత్తున హాజరై మ్యాచ్‌ను వీక్షించారు.



ఆర్.కె. బీచ్‌లో



పోర్టు స్టేడియంలో..

సరస్వతీ నిలయాలు మారిన రూపురేఖలు



భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రభుత్వం నాడు–నేడు పథకంలో పాఠశాలలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడంతో వాటి రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. ప్రతీ స్కూల్లోనూ మంచి టాయిలెట్లు, నీటి సరఫరా, విద్యుదీకరణ, ఫర్నిచర్, గ్రీన్ చాక్ బోర్డ్స్, భవనాలకు రంగులు వేయడం, ఇంగ్లిష్ ల్యాబ్ ఏర్పాటు, ప్రహరీ, కిచెన్ షెడ్డు నిర్మాణం, అదనపు తరగతి గదులు, డిజిటల్ లెర్నింగ్ బోర్డుల వంటి మౌలిక వసతులు సమకూరడంతో కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రతి విద్యార్థి పాఠశాలలో చక్కగా చదువుకొనే వాతావరణం కలిగింది. చదువుల మీద పెట్టే ప్రతి పైసా.. పవిత్రమైన పెట్టుబడని, పిల్లలను బాగా చదివించినప్పుడే వాళ్ల జీవితాలు మారుతాయన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం ఇప్పుడు నెరవేరుతోంది. దీంతో పాటు అమ్మఒడి, జగనన్న గోరుముద్ద వంటి పథకాలు కూడా అమలు చేయడంతో స్కూళ్లకు హాజరయ్యే విద్యార్థుల శాతం పెరుగుతోంది.

-9లో



చూడముచ్చటగా అక్కయ్యపాలెం ఎన్జీవోస్ కాలనీలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల

ఇళ్ల మరమ్మతులకు 22 నుంచి దరఖాస్తుల జారీ

- 23 నుంచి శ్రీదేవి కాంప్లెక్స్‌లో స్వీకరణ
- సింహాచలం ఈవో శ్రీనివాసమూర్తి వెల్లడి



పంచగ్రామాల వ్యూ

సింహాచలం: పంచ గ్రామాల్లోని వరాహ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానానికి సంబంధించిన భూముల్లో ఇళ్ల మరమ్మతులకు ఈ నెల 22 నుంచి దరఖాస్తులు జారీ చేస్తున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. మెమోలో పొందుపరచిన ఉత్తర్వులకు లోబడి గృహాలకు మరమ్మతులు చేసుకోదలిచిన వారు ఈ నెల 22 నుంచి దేవస్థానానికి చెందిన కొండ దిగువ శ్రీదేవి కాంప్లెక్స్‌లో దరఖాస్తులు పొందవచ్చని సూచించారు. www.simhachalamdevasthanampermissionforrepairs.com వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు, హామీ పత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులో తెలిపిన అన్ని వివరాలను జతచేస్తూ.. ఈ నెల 23 నుంచి శ్రీదేవి కాంప్లెక్స్ గ్రౌండ్ ఫ్లోర్‌లో దరఖాస్తులను అందజేసి రసీదు తీసుకోవాలన్నారు. 10 రోజుల్లోపు సర్వే బృందం దరఖాస్తుదారుడి ఇంటిని పరిశీలిస్తుందని చెప్పారు. వారిచ్చిన నివేదికను సమర్పించిన తర్వాత ప్రభుత్వ మెమోకు లోబడి తీసుకునే చర్యలను దరఖాస్తుదారుడికి తెలియజేస్తామన్నారు. కొత్త నిర్మాణాలకు గానీ, ఏ రకమైన మార్పులకు గానీ అనుమతి లేదని స్పష్టం చేశారు. కేవలం మరమ్మతుల వరకు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, సర్వే బృందం వచ్చినపుడు సహకరించాలని ఈవో శ్రీనివాసమూర్తి కోరారు.

ఫిషింగ్ హార్బర్‌లో ఘోర అగ్ని ప్రమాదం





ఫిషింగ్ హార్బర్‌లో దగ్ధమవుతున్న బోట్లు

- 30 నుంచి 40 వరకు బోట్లు దగ్ధం
- మంటలు అదుపులోకి తీసుకువస్తున్న అగ్నిమాపక శాఖ అధికారులు
- కోట్ల రూపాయలలో నష్టం
- ఘటన స్థలానికి చేరుకున్న పోలీస్ అధికారులు

సీతమ్మధార : వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫిషింగ్ హార్బర్‌లో ఆదివారం అర్ధరాత్రి ఘోర అగ్ని ప్రమాదం సంభవించింది. సుమారు 30 నుంచి 40 బోట్ల వరకు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో ఆస్తి నష్టం కోట్లలో ఉంటుందని భావిస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో హార్బర్‌లో నిలిపి ఉంచిన బోట్ల నుంచి ఒక్కసారిగా మంటలు రేగడంతో స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖ, పోలీసులకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక శాఖ అధికారులు అప్రమత్తమై మంటలు అదుపులోకి తీసుకువస్తున్నారు. విషయం తెలుసుకున్న బోట్ల యాజమానులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. గతంలో కూడా బోట్లు దగ్ధమైన ఘటనలు ఉన్నాయి. పోలీసు అధికారులు, మెరైన్ పోలీసులు, ఇతర అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

నేడు జీవీఎంసీలో జగనన్నకు చెబుదాం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నారు. నగర ప్రజలు పాల్గొని సమస్యలు తెలుపుకోవచ్చు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మేయర్ హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ కోరారు.

శరవేగమే.. శరాఘాతం

- రోడ్డు ప్రమాదాల్లో ఇండియా 8వ స్థానంలో ఉంది
- రహదారి భద్రత అందరి బాధ్యత
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



రోడ్డు ప్రమాద మృతులకు నివాళులర్పిస్తున్న మంత్రి అమర్‌నాథ్, మేయర్ హరివెంకటకుమారి తదితరులు

ఏయూక్యాంపస్: యువత అతి వేగానికి బలవుతున్నారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆందోళన వ్యక్తం చేశారు. వరల్డ్ డే ఆఫ్ రిమెంబరెన్స్ ఆఫ్ రోడ్డు ట్రాఫిక్ విక్టమ్స్ సందర్భంగా ఆదివారం విశాఖ పోలీస్ శాఖ ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు ట్రాఫిక్ నియమావళిని పాఠ్యాంశంగా బోధించాలన్నారు. ఏటా ఈ డే నిర్వహించేలా విశాఖలో స్మారక స్థూపం(పైలాన్) ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రపంచంలో ఉన్న వాహనాల్లో ఒక శాతం ఇండియాలో ఉన్నాయని, ప్రమాదాలు మాత్రం 11 శాతం జరుగుతున్నాయని విచారం వ్యక్తం చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఎవరైనా పట్టుబడితే తన కార్యాలయం నుంచి ఫోన్ వచ్చినా వదలొద్దని పోలీసులకు సభాముఖంగా చెప్పారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న వారిలో 5–29 మధ్య వయస్కులే అధికంగా ఉన్నారన్నారు. రోడ్డు ప్రమాదాల్లో భారత్ ప్రపంచంలో 8వ స్థానంలో ఉండటం ఆందోళన కలిగించే అంశమన్నారు. ఇటీవల కాలంలో వాహనచోదకులు హెల్మెట్ ధరిస్తున్నారని, రహదారి భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని పిలుపునిచ్చారు. వాహనాలు నడిపే సమయంతో ప్రతీ వ్యక్తి తన కుటుంబాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి మాట్లాడుతూ సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపడం నేడు పరిపాటిగా మారిందని, ఇది ఎంత మాత్రం శ్రేయస్కరం కాదన్నారు. పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ అయ్యన్నార్ మాట్లాడుతూ తీవ్రవాదం వలన పోయే ప్రాణాల కంటే.. అధికంగా రోడ్డు ప్రమాదాల వల్ల ప్రజల ప్రాణాలు పోతున్నాయన్నారు. త్వరలో రోడ్ ట్రాఫిక్ కమాండోలను నియమిస్తామన్నారు. మద్యం తాగి ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలను నడపవద్దన్నారు. అత్యధికంగా ప్రమాదాలు జరిగే కూడళ్లు, రహదారులను గుర్తించామని.. ఆయా ప్రాంతాల్లో ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. డీటీసీ రాజారత్నం మాట్లాడుతూ గత ఏడాది విశాఖలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 358 మంది మరణించారని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదాల్లో తమ కుటుంబ సభ్యులను కోల్పోయిన వారు, గాయపడ్డ వారు తమ జీవితంలో ఏం కోల్పోయామో వివరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేకంగా తీర్చిదిద్దిన వీడియోను ఈ సందర్భంగా ప్రదర్శించారు. ప్రత్యేక పోస్టర్లను మంత్రి అమర్‌నాథ్ ఆవిష్కరించారు. రహదారి ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారిని స్మరించుకుంటూ కొవ్వొత్తులు వెలిగించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ అశోక్ కుమార్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాద మృతులకు నివాళి అర్పిస్తున్న నగర ప్రజలు

సూర్య దేవా నమో నమః



సాగరతీరంలో ఛట్ పూజ చేస్తున్న విశాఖలో నివాసం ఉంటున్న ఉత్తరాది ప్రజలు

ఆర్.కె.బీచ్‌లో ఘనంగా ఛట్ పూజ

బీచ్‌రోడ్డు: ఆర్.కె.బీచ్‌లో ఆదివారం ఘనంగా ఛట్ పూజ జరిగింది. విశాఖ ఛట్ పూజ సమితి ఆధ్వర్యంలో సిటీలో నివాసం ఉంటున్న ఉత్తరాది వాసులు భక్తిశ్రద్ధలతో ఈ పూజ నిర్వహించారు. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు ఈ పూజ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. సూర్యోదయం, సూర్యాస్తమయం సమయంలో సూర్యభగవానుడికి పూజించడమే ఛట్ పూజ ప్రధాన సంప్రదాయమన్నారు. ఆరేళ్లుగా ఏటా సాగరతీరంలో ఛట్ పూజను కొనసాగిస్తున్నామని.. ఈ ఏడాది సుమారు 5 వేల మంది భక్తులు పాల్గొన్నట్లు చెప్పారు. రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు ఈ కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. సంస్థ ప్రతినిధులు సుభాష్ చంద్ర రాయ్, ప్రకాష్ భర్తియా, వికాస్ భర్తియా, ఆనంద్ పాథక్ తదితరులు పాల్గొన్నారు.



దీపం వెలిగిస్తున్న మహిళ



సూర్యభగవానుడికి పూజలు చేస్తున్న ప్రజలు

ఆర్టీసీ 'కార్తీక' స్పెషల్స్


పంచారామాల యాత్ర బస్సులను ప్రారంభిస్తున్న జిల్లా డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ సత్యనారాయణ, ద్వారకా బస్ స్టేషన్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ హెచ్.అమరసింహుడు, డిపో మేనేజర్ గంగాధర్

- ఒకవైపు శైవ క్షేత్రాల దర్శనం.. మరోవైపు పిక్నిక్ స్పాట్స్‌కు సర్వీసులు

అల్లిపురం/డాబాగార్డెన్స్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్‌ఆర్టీసీ) విశాఖపట్నం రీజియన్ పంచారామక్షేత్ర దర్శిని, కార్తీకమాసం వనసమారాధనల నేపథ్యంలో లంబసింగి, అరకు, ధారమఠానికి ప్రత్యేక సర్వీసులు నడపనుందని ప్రజా రవాణా అధికారి అప్పలరాజు తెలిపారు.

పంచారామాలకు బస్సులు ప్రారంభం

హైందవ సంప్రదాయంలో కార్తీక మాసానికి విశేష ప్రాముఖ్యత ఉంది. లయకారుడైన ఆ పరమశివుని కార్తీక మాసంలో, అందునా సోమవారం రోజున దర్శిస్తే సకల పాపాలు హరిస్తాయని ప్రతీతి. అందువల్ల ఈ నెల 14 నుంచి కార్తీక మాసం ప్రారంభమైన దృష్ట్యా విశేష పర్వదినాలైన సోమవారం రోజున 5 ప్రముఖ శైవక్షేత్రాలు దర్శించేలా పంచారామ క్షేత్ర దర్శినిని ఆర్టీసీ ప్రవేశపెట్టింది. పంచారామాల సందర్శనకు మూడు బస్సులను ఆదివారం సాయంత్రం ద్వారకా బస్ స్టేషన్‌లో విశాఖ జిల్లా డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జి.సత్యనారాయణ, ద్వారకా బస్ స్టేషన్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ హెచ్.అమరసింహుడు, విశాఖపట్నం డిపో మేనేజర్ గంగాధర్ ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఒకే రోజు అమరావతి (అమరేశ్వరుడు), భీమవరం (భీమేశ్వరుడు), పాలకొల్లు (క్షీర రామలింగేశ్వరుడు), ద్రాక్షారామం (భీమలింగేశ్వరుడు), సామర్లకోట (కుమార రామలింగేశ్వరుడు) దర్శించుకునే విధంగా ప్యాకేజీ రూపంలో ఏపీఎస్ ఆర్టీసీ రూపొందించిందన్నారు. ప్రతి ఆదివారం సాయంత్రం ద్వారకాబస్ స్టేషన్ నుంచి బస్సులు బయలుదేరుతాయని తెలిపారు. సూపర్ లగ్జరీ బస్సుకు ఒక్కొక్కరికి రూ.2,100, అల్ట్రా డీలక్స్ బస్సు రూ.2,050 నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో విశాఖపట్నం డిపో అసిస్టెంట్ మేనేజర్ పి.శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

ఏఏ రోజుల్లో..

కార్తీకమాసంలో వచ్చే అన్ని ఆదివారాలు..అనగా ఈ నెల 19, 26, డిసెంబర్ 3, 10 తేదీల్లో సాయంత్రం 5 గంటలకు విశాఖ ద్వారకా బస్‌స్టేషన్ నుంచి బస్సులు బయలుదేరుతాయి. ప్రయాణచార్జీ (ఒక్కరికి) సూపర్‌లగ్జరీ రూ.2,100, అల్ట్రా డీలక్స్..రూ.2050

లంబసింగి టూర్..

కార్తీకమాసం పురస్కరించుకొని పిక్నిక్‌ల సందడి దృష్ట్యా ఆర్టీసీ లంబసింగికి ప్రత్యేక బస్సులు నడుపుతోంది. ఈ బస్సులు శని, ఆదివారాల్లో ఉదయం 3 గంటలకు ద్వారకా బస్టేషన్ నుంచి బయలుదేరుతాయి. లంబసింగి, తాజంగి డ్యామ్, కొత్తపల్లి వాటర్‌ఫాల్స్, మోదమాంబ గుడి (పాడేరు), కాఫీ తోటలు వీక్షించేలే ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. ప్రయాణచార్జీ (ఒక్కరికి) అల్ట్రాడీలక్స్ రూ.800, ఎక్స్‌ప్రెస్:రూ.650

అరకు టూర్

కార్తీకమాసం పురస్కరించుకొని ప్రతి శని, ఆదివారాల్లో ఉదయం 6 గంటలకు ద్వారకాబస్టేషన్ నుంచి బస్సులు నడపనున్నారు. డముకు వ్యూ పాయింట్, గాలికొండ వ్యూ పాయింట్, చాపరాయి, పద్మాపురం గార్డెన్స్, ట్రైబల్ మ్యూజియం చూపించనున్నారు. ప్రయాణ చార్జీ (ఒక్కరికి) అల్ట్రా డీలక్స రూ.800, ఎక్స్‌ప్రెస్..రూ.650

ధారమఠం

కార్తీక మాసంలో వచ్చే ప్రతి శని, ఆదివారాల్లో ఉదయం 7 గంటలకు ద్వారకాబస్టేషన్ నుంచి సర్వీసులు నడపనుంది. శివాలయం, ధారమఠం వాటర్ ఫాల్స్, అల్లూరి సీతారామరాజు మ్యూజియం, బొజ్జన్నకొండ (అనకాపల్లి). ప్రయాణచార్జీ (ఒక్కరికి) అల్ట్రా డీలక్స్..రూ.650, ఎక్స్‌ప్రెస్..రూ.550.

మరిన్ని వివరాలకు..

టికెట్స్ ముందుగా బుక్ చేసుకోదలచే వారు ఏపీఎస్‌ఆర్టీసీ.ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చు. లేదా ద్వారకాబస్‌స్టేషన్‌లోని రిజర్వేషన్ కౌంటర్‌లో బుక్‌చేసుకునే సౌకర్యం కల్పించారు. లేదా 9959225602, 7382921540, 9959225594, 9100109731, 7382914219, 9959221199 నంబర్లలో సంప్రదించవచ్చు.

ప్రణాళికతో సిద్ధమైతే విజయం మీదే..


అవగాహన సదస్సుకు హాజరైన విద్యార్థులు, ఉద్యోగార్థులు


మాట్లాడుతున్న సివిల్స్ విజేత బాలలత

- తలరాత మారేలా కసితో చదవాలి
- పోటీ పరీక్షలపై సివిల్స్ విజేత బాలలత సూచనలు
- 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో గ్రూప్–1, 2 అవగాహన సదస్సుకు విశేష స్పందన


శ్రీకాకుళం నుంచి వచ్చిన దంపతులు

విశాఖ విద్య: 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో గ్రూప్–1, 2 ఉద్యోగ పరీక్షలపై విశాఖలోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత అవగాహన సదస్సుకు విశేష స్పందన లభించింది. ఉమ్మడి విశాఖ జిల్లాతో పాటు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి విద్యార్థులు, ఉద్యోగార్థులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. హైదరాబాద్ సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్, సివిల్స్ విజేత బాలలత గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి విలువైన సూచనలు, సలహాలు ఇచ్చారు. త్వరలోనే గ్రూప్స్ నోటిఫికేషన్ రానున్నందున పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో తెలిపారు.

ఒత్తిడి జయిస్తేనే విజయం

పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు, ఉద్యోగార్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఒత్తిడికి గురికావొద్దన్నారు. గ్రూప్స్ పరీక్షలు మనం ఎదుర్కోగలమా అనే అనుమానం మనస్సులో నుంచి పూర్తిగా తీసేయాలన్నారు. పోలియో కారణంగా కాళ్లకు సమస్య వచ్చినందున మరో వ్యక్తి సాయమందిస్తేనే ప్రయాణం సాగే పరిస్థితుల్లో, చదువుతోనే నా తలరాత మార్చుకున్నానన్నారు. హైదరాబాద్‌లో కోచింగ్ సెంటర్‌కు వెళితే, సివిల్స్ నీ వల్ల అవుతుందా అని అవమానాలకు గురిచేశారని, ఆ కసితోనే 2004లో సివిల్స్ ఆలిండియా 399వ ర్యాంకు, 2016లో 167వ ర్యాంకు సాధించానని చెప్పారు. చదువు నిరంతర ప్రక్రియ అని, చదువుతోనే మన తలరాత మార్చుకోవాలని సూచించారు. మన లైఫ్‌ను మనమే తీర్చిదిద్దుకొని సమాజానికి బ్రాండ్ అంబాసిడర్‌గా మారాలన్నారు. ప్రణాళికాబద్ధమైన ప్రిపరేషన్‌తో ముందుకెళితే విజయం మీదేనన్నారు. పలువురు విద్యార్థులు, అభ్యర్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు మాట్లాడుతూ పలు దపాలుగా గ్రూప్స్ పరీక్షలు రాసి, నాలుగు ఉద్యోగాలకు ఎంపికయ్యాయని, పట్టుదలతో చదివితే ఏదైనా సాధించవచ్చన్నారు. సాక్షి మీడియా ఆధ్వర్యంలో ఇలాంటి సదస్సు ఏర్పాటు చేయటం హర్షనీయమని అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు అన్నారు.

బాలలత ఇచ్చిన సూచనల్లో కొన్ని..

- ప్రతీ రోజూ 7 నుంచి 8 గంటల పాటు చదువు కోవాలి. 2 నుంచి 3 గంటల పాటు మోడల్ పేపర్లు ప్రాక్టీస్ చేయాలి.
- భారీ మెటీరియల్ జోలికి వెళ్లకుండా, సొంత నోట్స్ సిద్ధం చేసుకోవాలి. పోటీ పరీక్షల్లో వచ్చే ప్రశ్నల స్థాయి ఏటేటా పెరుగుతుండటంతో అందుకు అనుగుణంగా సిద్ధం కావాలి.
- సామాజిక అంశాలపై కచ్చితమైన అవగాహన ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసే సంక్షేమ పథకాలపై కూడా అధ్యయనం చేయాలన్నారు.
- ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ వంటి అంశాలపై పట్టుసాధించాలి.
- గ్రూప్స్‌లో అబ్జెక్టివ్ విధానం అమల్లోకి వస్తున్నందున, తక్కువ సమయంలో పరీక్షను ఎదుర్కొనేలా ప్రాక్టీస్ చేయాలి.


సూచనలందిస్తున్న సాక్షి ఎడ్యుకేషన్ విభాగం ప్రతినిధి


నోట్సు రాసుకుంటున్న విద్యార్థులు

సాక్షికి కృతజ్ఞతలు



ప్రైవేటు ఫార్మా కంపెనీలో పనిచేస్తూ, గ్రూప్స్‌కు సిద్ధమవుతున్నాను. బాలలత మేడమ్ క్లాస్ వినాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నాను. సాక్షి మీడియా వారు ఇలాంటి సదస్సు ఏర్పాటు చేయటం వల్ల నాలాంటి వారికి ఎంతో ఉపయోగం. సాక్షి మీడియాకు కృతజ్ఞతలు.

– బి.వి.రవీంద్ర, కూర్మన్నపాలెం, విశాఖపట్నం

విలువైన సదస్సు



నేను పాడేరులో స్త్రీ శిశు సంక్షేమశాఖలో ఈవోగా పనిచేస్తున్నాను. గ్రూప్స్‌లో విజయం సాధించి రెవెన్యూలో మంచి పోస్టు కొట్టాలనేది లక్ష్యం, బాలలత మేడమ్ సదస్సుకు వస్తున్నారని తెలిసి వచ్చాను. ఎన్నో విషయాలు తెలుసుకున్నాను. సాక్షి మీడియా వారు విలువైన సదస్సు ఏర్పాటు చేశారు.

–రెడ్డి విమల, చోడవరం, అనకాపల్లి జిల్లా

ఎంతో ఉపయోగం



బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేసి, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాను. బాలలత మేడమ్‌ను తీసుకొచ్చి, మాలాంటి వారికి అవసరమైన సూచనలు, సలహాలు ఇప్పించిన సాక్షి మీడియా వారికి ధన్యవాదాలు. ఇలాంటి సదస్సుల వల్ల ఎంతో ఉపయోగం.

– యు.సనత్‌కుమార్, విశాఖపట్నం

ఎన్నో విషయాలు తెలుసుకున్నాను



బీటెక్ చదువుతున్నాను. గ్రూప్స్‌కు ఇప్పటి నుంచే సిద్ధమవుతున్నాను. సాక్షి మీడియా వారు ఏర్పాటు చేసిన సదస్సుల్లో ఎన్నో విషయాలు తెలుసుకున్నారు. చదువుకునే సమయంలోనే ఇలాంటి సదస్సులకు హాజరవ్వటం వల్ల ఎంతో ఉపయోగం

– బి.మహేశ్వరి, తాటిచెట్లపాలెం, విశాఖ

చక్కగా వివరించారు



చోడవరం సచివాలయంలో ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్నాను. సాక్షి మీడియా ఆధ్వర్యంలో బాలలత మేడమ్‌తో గ్రూప్స్‌పై సదస్సు ఏర్పాటు చేస్తున్నారని తెలిసి వచ్చాను. గ్రూప్స్ గురించి చక్కగా వివరించారు. గ్రూప్స్‌లో విజయం సాధించాలనేది నా లక్ష్యం.

– ఆర్.మానస, చోడవరం, అనకాపల్లి జిల్లా

ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోండి


విశ్రాంత డీఎంఈ డాక్టర్ శశిప్రభతో వైద్యులు

మహారాణిపేట: వృత్తి పరంగా వైద్య రంగంలో వచ్చే అధునాతన వైద్య ప్రక్రియలు, విజ్ఞానాన్ని ఆకళింపు చేసుకోవాలని విశ్రాంత డీఎంఈ డాక్టర్ ఆర్.శశిప్రభ అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం అబ్‌స్ట్రాక్ట్ అండ్ గైనకాలజికల్ సొసైటీ ఆఫ్ విశాఖపట్నం 56వ వార్షిక నిరంతర వైద్య విద్య(సీఎంఈ) కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ శశిప్రభ మాట్లాడుతూ ప్రసూతిలో అనేక నూతన, అధునాతన వైద్య పోకడలు వస్తున్నాయని, వాటి పట్ల ప్రసూతి వైద్యులు అవగాహన కలిగి ఉండాలన్నారు. సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ వి.సీతారామరాజు మాట్లాడుతూ నూతన పద్ధతుల మీద అవగాహన కలిగించేందుకు సీఎంఈ తరచూ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. సొసైటీ కార్యదర్శి డాక్టర్ అల్లూ నిహారిక ఈ ఏడాది చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. ఫెడరేషన్ ఆఫ్ అబ్‌స్ట్రాక్ట్ అండ్ గైనకాలజికల్ సొసైటీ(ఎఫ్‌వోజీఎస్‌ఐ) దక్షిణ విభాగ ఉపాధ్యక్షురాలు డాక్టర్ సంపత్ కుమారి, కేజీహెచ్ క్యాన్సర్ విభాగాధిపతి డాక్టర్ శిల్ప, పలువురు ప్రసూతి వైద్యులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	530.00
విజయనగరం	534.00
శ్రీకాకుళం	534.00

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	:రూ.95
స్కిన్	:రూ.160
స్కిన్‌లెస్	:రూ.170

అగ్నికుల క్షత్రియులకు సముచిత స్థానం

- ఎంపీ మోపిదేవి వెంకటరమణ


అగ్నికుల క్షత్రియ కార్తీక వన సమారాధనలో మాట్లాడుతున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణ

అక్కిరెడ్డిపాలెం: అగ్నికుల క్షత్రియులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అత్యున్నత పదవులు కేటాయించిందని ఎంపీ మోపిదేవి వెంకటరమణ అన్నారు. ఆదివారం గ్లోబెక్స్ సమీపంలోని జిల్లా అగ్నికుల క్షత్రియ కార్తీక వన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అగ్నికుల క్షత్రియులు సామాజిక వర్గం అత్యంత బలంగా ఉందన్నారు. మరో అతిథి గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బీసీలకు సముచిత స్థానం ఉందన్నారు. సామాజిక భవన నిర్మాణానికి 500 గజాల స్థలం కేటాయించాలిన మోపిదేవి, ఎమ్మెల్యే నాగిరెడ్డికి అగ్నికుల క్షత్రియులు వినతిపత్రం అందజేశారు. అనంతరం సంక్షేమ సంఘం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త, ఎంఎస్‌ఎంఈ డెవలప్‌మెంటక్ కార్పొరేషన్ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్, అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బర్రి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి శాంతారామ్, సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అంగరామ్‌ప్రసాద్, ప్రధాన కార్యదర్శి బర్రి మురళీకృష్ణ రాజు, కార్యనిర్వాహక కార్యదర్శి వరదాడ వెంకటరమణ, మాజీ మేయర్ పులుసు జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ జిల్లా కమిటీ ఎన్నిక

విశాఖ విద్య: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ విశాఖ జిల్లా కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహన్‌రావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. గౌరవ అధ్యక్షుడిగా అనకాపల్లి పైడి రాజు, అధ్యక్షుడిగా దాసరి నాగేశ్వరరావు, అసోసియేషన్ అధ్యక్షుడిగా ప్రభాకర్‌రావు, ఉమాదేవి, ప్రధా న కార్యదర్శిగా అంబేడ్కర్ ఎంపికయ్యారు. కోశాధికారిగా రాంబాబు, జిల్లా కార్యదర్శులుగా రాము, సత్యం, రియాజ్, జగన్, రిజ్వాన్, రామలక్ష్మిని ఎన్నుకున్నారు.

ప్రకృతి అందాలకు ఫిదా

- భారీగా తరలివచ్చిన పర్యాటకులు
- సందర్శిత ప్రాంతాల్లో వీకెండ్ సందడి

సాక్షి, పాడేరు: వీకెండ్ కావడంతో జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు సందర్శకుల రాకతో కళకళలాడాయి. మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన వంజంగిహిల్స్‌కు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. సూర్యోదయం, మంచు, మేఘాల అందాలను వీక్షించారు.

బొర్రాకు రూ.3.16లక్షల ఆదాయం

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు పర్యాటకులు ఆదివారం పోటెత్తారు. సుమారు 3500 మంది తిలకించగా, రూ. 3.16 లక్షల ఆదాయం వచ్చిందని మేనేజర్ గౌరీ శంకర్ తెలిపారు. సరియా, తాటిగుడ, కటికి, చిట్టంపాడు జలపాతాలు పర్యాటకులతో సందడిగా మారాయి.

కొత్తపల్లి జలపాతానికి..

జి.మాడుగుల: కొత్తపల్లి జలపాతానికి పర్యాటకులు పోటెత్తారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా నుంచి భారీగా పర్యాటకులు తరలివచ్చారు. ప్రత్యేక వాహనాల్లో కుటుంబ సమేతంగా వచ్చి జలపాతాల్లో స్నానాలు చేస్తూ సందడి చేశారు. చీకులు, బొంగు చికెన్ అమ్మకాలు భారీగా జరిగాయి.


బొర్రాకు భారీగా తరలివచ్చిన పర్యాటకులు

చెరువుల వేనం.. అద్భుతం

చింతపల్లి రూరల్: ప్రముఖ పర్యాటక కేంద్రమైన లంబసింగి చెరువులవేనం పర్యాటకులతో కిటకిటలాడింది. శనివారం లంబసింగి చేరుకున్న పర్యాటకులు అక్కడ రాత్రి బస చేసి తెల్లవారుజామున వ్యూపాయింట్‌కు చేరుకున్నారు. పాలసముద్రాన్ని తలపించే మంచు అందాలను వీక్షించారు. తాజంగి రిజర్వాయర్ వద్ద పర్యాటకులు సందడి చేశారు.

చాపరాయికి...

డుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతానికి మైదాన ప్రాంతం నుంచి భారీగా పర్యాటకులు తరలివచ్చారు. అరకు–పాడేరు ప్రధాన రోడ్డు మార్గానికి ఇరువైపులా ఉన్న వలిసె,పొద్దుతిరుగుడు తోటల్లో ఫొటోలు తీసుకుంటూ సందడి చేశారు. చాపరాయి జలపాతంలో స్నానాలు చేస్తూ ఉత్సాహంగా గడిపారు.

మారేడుమిల్లి : మండలంలో ప్రముఖ పర్యాటక ప్రదేశాలైన జలతరంగిణి, అమృతధార జలపాతాలు, వాలిసుగ్రీవ్ వనమూలికల సంరక్షణ ప్రదేశం, జంగిల్ స్టార్, పాములేరు. గుడిస హిల్‌టాప్, వ్యూపాయింట్లు పర్యాటకులతో సందడి నెలకొంది. జలతరంగిణి, అమృతధార జలపాతాల్లో స్నానాలు చేస్తూ ఉల్లాసంగా గడిపారు.అటవీ ప్రాంతంలో వంటలు చేసుకొని కుటుంబ సమేతంగా వనభోజనాలు చేశారు.


వంజంగి హిల్స్‌కు పోటెత్తిన పర్యాటకులు


పొద్దుతిరుగుడు తోటలో ఫొటోలు తీసుకుంటున్న సందర్శకులు

ఘనంగా క్రాంతి ప్రాపర్టీస్ వార్షికోత్సవం


కేక్ కట్ చేస్తున్న డైరెక్టర్లు

గాజువాక : క్రాంతి ప్రాపర్టీస్ 11వ వార్షికోత్సవాన్ని గాజువాకలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు వి.శ్రీనివాసరావు, కె.ఎస్.నాగేశ్వరరావు కేక్ కట్ చేసి సంబరాలలు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ 11 ఏళ్లుగా విశాఖ, విజయనగరం, అనకాపల్లి జిల్లాల్లో వుడా అనుమతి పొందిన ఇళ్ల స్థలాలను తమ కస్టమర్లకు తక్కువ ధరలకు అందిస్తున్నామని తెలిపారు. భవిష్యత్‌లో వీఎంఆర్‌డీ అనుమతి పొందిన మరిన్ని లే అవుట్లను అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు జి.అనురాధ రామనాథం, ఎస్.శంకర్ శ్రీనివాస్, కె.పద్మజా శ్రీనివాస్, ఎన్.సూర్యనారాయణ, బి.జయప్రకాష్, ఎన్‌ఆర్‌ఐ నాయుడు, బి.నీలిమారావు, జి.శ్రీరామన్నారాయణ, జి.ఎల్.ఎన్.మూర్తి, గాజువాక బ్రాంచి మేనేజర్ ఎన్.ఎస్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.